
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 22 జూన్ 2024 | 3

25న గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు -5లో
మరిడమ్మ ఆలయంలో ఉయ్యాల తాళ్ల ఉత్సవం -6లో



పిఠాపురం ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న పవన్‌కల్యాణ్



పెద్దాపురం ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న చినరాజప్ప



జగ్గంపేట ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న జ్యోతుల నెహ్రూ



ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న వరుపుల సత్యప్రభ



కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న పంతం నానాజీ



తుని ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేస్తున్న యనమల దివ్య

కొలువుదీరిన అసెంబ్లీ

- ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేసిన డిప్యూటీ సీఎం పవన్
- ప్రమాణస్వీకారం చేసిన జిల్లా ఎమ్మెల్యేలు
- తొలిరోజు చేయని కాకినాడ సిటీ ఎమ్మెల్యే.. నేడు చేసే అవకాశం

పిఠాపురం, జూన్ 21: అసెంబ్లీ కొలువు దీరింది. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌తోపాటు జిల్లాలోని ఎమ్మెల్యేలు శాసనసభ్యులుగా ప్రమాణస్వీకారం చేశారు. తొలిరోజు సమావేశాలకు కాకినాడ సిటీ ఎమ్మెల్యే హాజరుకాలేదు. నవ్యాంధ్రప్రదేశ్‌లో ఎన్నికల తర్వాత ఏర్పాటైన మూడో అసెంబ్లీ తొలి సమావేశాలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. జిల్లాలో ఏడు అసెంబ్లీ స్థానాలు ఉండగా అయిదింటిని టీడీపీ, రెండింటిని జనసేన గెలుచుకున్నాయి. తొలి సమావేశాలను ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారాలకు, స్పీకర్ ఎన్నికకు మాత్రమే పరిమితం చేశారు. తొలి సమావేశాలు కావడం, తమ ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేస్తుండడంతో జిల్లావ్యాప్తంగా టీడీపీ, జనసేన, బీజేపీ నేతలు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు టీవీలు, మొబైల్స్ ద్వారా ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించారు. తమ ఎమ్మెల్యేలు ప్రమాణం చేసే సమయంలో హర్షం వ్యక్తం చేశారు.

పవన్ అనే నేను..

పిఠాపురం అసెంబ్లీ నియోజకవర్గంనుంచి శాసనసభ్యుడిగా ఎన్నికై తొలిసారి శాసనసభలో అడుగుపెట్టిన జనసేన అధినేత, రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కి టీడీపీ, జనసేన, బీజేపీ సభ్యుల కరతాళ ధ్వనుల మధ్య స్వాగతం లభించింది. సీఎం చంద్రబాబు ప్రమాణస్వీకారం అనంతరం ఆయన ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం చేశారు. కొణిదల పవన్‌కల్యాణ్ అనే నేను ఆంధ్రప్రదేశ్ శాసనసభకు ఎన్నికైన సభ్యుడిగా అన్నప్పుడు పిఠాపురం నియోజకవర్గంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జనసేన నాయకులు, జనసైనికులు, వీరమహిళలు, అభిమానులు ఆనందపారవశ్యులయ్యారు. ఎమ్మెల్యేగా ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి వద్దకు వెళ్లి నమస్కరించి సభలోని సభ్యులతోపాటు సీఎం చంద్రబాబుకు అభివాదం చేశారు. అనంతరం శాసనసభ్యులుగా జిల్లాలోని కాకినాడ రూరల్, పెద్దాపురం, జగ్గంపేట, ప్రత్తిపాడు, తుని ఎమ్మెల్యేలు పంతం నానాజీ, నిమ్మకాయల చినరాజప్ప, జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య ప్రమాణస్వీకారం చేశారు. వీరంతా ప్రమాణస్వీకారం అనంతరం ప్రొటెమ్ స్పీకర్ గోరంట్ల బుచ్చయ్య చౌదరికి నమస్కరించి సీఎం నారా చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి నారా లోకేశ్ సహా మిగిలిన వారికి అభివాదం చేశారు.

హాజరు కాని వనమాడి

తొలిరోజు సభ్యుల ప్రమాణస్వీకార కార్యక్రమానికి కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు(కొండబాబు) హాజరు కాలేదు. ఆయన శనివారం ప్రమాణస్వీకారం చేసే అవకాశం ఉంది. కాగా ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారం అనంతరం శాసనసభ స్పీకర్ పదవికి నర్సీపట్నం ఎమ్మెల్యే చింతకాయల అయ్యన్నపాత్రుడు పేరును ప్రతిపాదిస్తూ నామినేషన్ పత్రాలను అందించిన వారిలో డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ కూడా ఉన్నారు.

జిల్లావ్యాప్తంగా సంబరాలు

జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేల ప్రమాణస్వీకారంతో సంబరాలు జరిగాయి. తమ నేతలు ఎమ్మెల్యేలు ప్రమాణస్వీకారం చేస్తున్న సమయంలో నాయకులు, కార్యకర్తలు స్వీట్లు పంపిణీ చేశారు. బాణసంచా కాల్చి తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. పలువురు నాయకులు తమ ఎమ్మెల్యేల కూడా అమరావతి వెళ్లినా అసెంబ్లీలోకి వెళ్లే అవకాశం లభించలేదు. మరోవైపు ఎమ్మెల్యేల కుటుంబసభ్యులకు పాస్‌లు ఇవ్వకపోవడంతో వారికి నిరాశే మిగిల్చింది. వీరు టీవీల్లోనే ప్రమాణస్వీకారాలను తిలకించారు.

పెత్తనం.. పోనివ్వమంతే..



- ప్రభుత్వం మారినా కాకినాడ జీజీహెచ్‌లో ఆగని వైసీపీ నేతల పెత్తనం
- ఆస్పత్రి పారిశుధ్య నిర్వహణ, సామగ్రి కొనుగోలులో వీరు చెప్పిందే వేదం
- ఎన్నికలకు ముందు అధికారం అండతో ఆస్పత్రి శానిటేషన్ సబ్ కాంట్రాక్టర్‌కు బెదిరింపులు
- కాంట్రాక్టు రద్దు చేయిస్తానంటూ బలవంతంగా 60శాతం వాటా లాగేసుకున్న ఎమ్మెల్సీ తోట బినామీ
- ఆయనొచ్చాక శానిటేషన్ పడక.. అధికారులు హెచ్చరిస్తే వారికీ తాజాగా బెదిరింపులు
- త్వరలో పిలవబోయే కొత్త టెండర్లపై కన్నేసి అప్పుడే తెరవెనుక రాయబేరాలు

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

రాష్ట్రంలో ప్రభుత్వం మారినా కాకినాడ జీజీహెచ్‌లో వైసీపీ నేతల దందాలు మాత్రం ఆగడం లేదు. ఇంకా అధికారంలో ఉన్నామనుకునే భ్రమలో అడ్డగోలుగా వ్యవహరిస్తున్నారు. అధికారులపైనా, చిరు కాంటాక్టర్లపైనా రుబాబులకు దిగుతున్నారు. ప్రశ్నించిన వారిపై బెదిరింపులకు పాల్పడుతున్నారు. ఆస్పత్రి పారిశుధ్య నిర్వహణకు కొనుగోలు చేసే సామగ్రిపైనా వీరే పెత్తనం చేస్తున్నారు. సరిగ్గా ఎన్నికలకు కొన్ని నెలల ముందు ఓ పారిశుధ్య సబ్ కాంట్రాక్టర్‌ను బెదిరించి వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు బినామీ ఏకంగా 60శాతం వాటా లాగేసుకున్నారు. తీరా శానిటేషన్ పనుల్లో నాణ్యత లేదని ప్రశ్నించిన అధికారులపైనా సదరు బినామీ ఇప్పటికీ తిరగబడుతున్నారు. మరోపక్క త్వరలో కొత్తగా శానిటేషన్ టెండర్లు పిలవడానికి రంగం సిద్ధమవుతుండడంతో కాంట్రాక్టు కొట్టేయడానికి ఆ బినామీ సదరు వైసీపీ ఎమ్మెల్సీ ద్వారా తెరవెనుక పావులు కదుపుతున్నారు. అధికారపార్టీ కీలక నేతలను మచ్చిక చేసుకునేందుకు రాయబేరాలు నడుపుతున్నారు.

మేం ఏం చెబితే అది..

కాకినాడ జీజీహెచ్‌పై వైసీపీ నేతల పెత్తనం ఇంకా కొనసాగుతూనే ఉంది. అధికారంలో ఉన్న అయిదేళ్లలో కాకినాడ సిటీ వైసీపీ ఎమ్మెల్యే ద్వారంపూడి అన్ని రకాలుగా పెత్తనం చేశారు. సిబ్బంది భర్తీ, కాంట్రాక్టు పనుల వరకు ఆయన చెప్పిందే వేదంగా జరిగింది. ఆయనకుతోడు వైసీపీ ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు సైతం తన బినామీలను రంగంలోకి దించి ఆస్పత్రిలో పలు కాంట్రాక్టులు కొట్టేశారు. అధికారులను బెదిరించి, భయపెట్టి ఇష్టానుసారం చెలరేగిపోయారు. ఆస్పత్రి అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనకు ఏరోజు ఒక్క రూపాయి నిధులు కూడా రాబట్టని సదరు వైసీపీ నేతలు ఆస్పత్రిపై పడి అనేక రకాలుగా దోచేసుకున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో ప్రభుత్వం మారింది. అరాచక వైసీపీ సర్కారు కుప్పకూలింది. తిరిగి టీడీపీ అధికారంలోకి వచ్చింది. అయినా ఇంకా కొందరు వైసీపీ నేతలు ఆస్పత్రిపై పెత్తనం వదులుకోవడానికి ఇష్టపడడం లేదు. ప్రభుత్వం మారినా ఇంకా పెత్తనం సాగిస్తున్నారు. ప్రధానంగా ఇంకా తనకు ఎమ్మెల్సీ పదవి ఉందనే నెపంతో వైసీపీ నేత తోటత్రిమూర్తులు తన బినామీల ద్వారా పెత్తనం నడిపిస్తున్నారు. ప్రధానంగా గంగరాజు అనే బినామీ ఆస్పత్రిలోనే పాగా వేశారు. అధికారులందరిపై ఇప్పటికీ చెలరేగిపోతున్నాడు. కాకినాడ జీజీహెచ్ ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల్లో పేదలకు పెద్ద దిక్కు. అవుట్‌పేషెంట్ విభాగానికి సోమవారం మూడు వేలు, ఇతర రోజుల్లో 1500 మంది రోగులు వచ్చి వెళ్తుంటారు. ఇన్‌పేషెంట్ విభాగంలో 1800మంది వరకు ఉంటారు. మెడికల్ కాలేజీకి సంబంధించి పీజీలు వందల్లో ఉంటారు. ఈ నేపథ్యంలో ఆస్పత్రిలో శానిటేషన్ అత్యంత కీలకం. ఈ నేపథ్యంలో కొన్నేళ్లుగా ఓ సబ్ కాంట్రాక్టర్ 500మంది వరకు సెక్యూరిటీ, పారిశుధ్య సిబ్బందిని నియమించుకుని సమర్థవంతంగా శానిటేషన్ నిర్వహిస్తున్నారు. అధికారుల సూచనలతో ఆధునిక యంత్రాలను కొనుగోలు చేసి మరీ పారిశుధ్య నిర్వహణ చేపడుతున్నారు. దీనిపై కన్నేసిన సదరు ఎమ్మెల్సీ బినామీ అధికారులపై కొన్నినెలల కిందట ఒత్తిడి తెచ్చి లక్షల విలువైన శానిటేషన్ సామగ్రిని తానే కొనుగోలు చేస్తున్నాడు. ఈ నెపంతో భారీగా నిధులు మింగేస్తున్నాడు. బిల్లు పత్రం లేకుండా అడ్డగోలుగా వ్యవహరిస్తున్నాడు. ఇదేంటని ప్రశ్నించిన అధికారులపై కొంతకాలం కిందట అప్పటి వైద్యశాఖమంత్రి విడదల రజనీ ద్వారా ఆస్పత్రి అధికారులకు సదరు ఎమ్మెల్సీ ఫోన్లు చేయించి ఒత్తిడి తెచ్చారు. ఇటీవల అసెంబ్లీ ఎన్నికలకు కొన్నినెలల ముందు సబ్‌కాంట్రాక్టర్‌ను బెదిరించి శానిటేషన్ కాంట్రాక్టులో వాటా కొట్టేశారు. ఇవ్వనని తెగేసి చెప్పిన సదరు సబ్‌కాంట్రాక్టర్‌పై తెగ ఒత్తిడి తెచ్చారు. వాటా ఇవ్వకపోతే సబ్‌కాంట్రాక్టు రద్దు చేయిస్తానని బెదిరించారు. అందులో భాగంగా శానిటేషన్ కాంట్రాక్టు కంపెనీకి ఫోన్లు చేసి సదరు ఎమ్మెల్సీ తన అధికారం ప్రయోగించారు. దీంతో భయపడి జీజీహెచ్ సబ్ కాంట్రాక్టర్ చేసేదిలేక 60శాతం వాటా సదరు నేత బినామీకి అప్పగించేశారు. వైసీపీ నేత వేధింపులు తట్టుకోలేక సదరు సబ్ కాంట్రాక్టర్ ఆత్మహత్యాయత్నం చేశారు. విషయం తెలిసి వైసీపీ నేత బినామీ తీరును నిరసిస్తూ సబ్ కాంట్రాక్టర్‌కు మద్దతుగా పారిశుధ్య సిబ్బంది సమ్మెకు దిగారు. అయినా సదరు బినామీ ఇదేం ఖాతరు చేయలేదు. ఎలాగూ డబ్బులు మిగులుతాయనే ఉద్దేశంతో లాభాలకోసం ఆస్పత్రి శానిటేషన్‌ను గాలికి వదిలేశారు. ఇదేంటని ఇటీవల ప్రశ్నిస్తే అధికారులను సైతం బెదిరించారు. వాస్తవానికి ప్రభుత్వం మారినా సదరు నేత బినామీ మాత్రం ఇక్కడినుంచి కదలడం లేదు. తమ వైసీపీ నేతకు ఇంకా ఎమ్మెల్సీ పదవి ఉందనే సాకుతో అధికారులకు చుక్కలు చూపిస్తున్నాడు. దీంతో అధికారులు మనకెందుకులే అని నోరుమెదపడం లేదు. దీనివల్ల ఇప్పుడు జీజీహెచ్‌లో పారిశుధ్య నిర్వహణ దారుణంగా తయారైంది.

కొత్త కాంట్రాక్టుపై కన్ను..

ప్రస్తుతం ఆస్పత్రి శానిటేషన్ నిర్వహణ కాంట్రాక్టు గడువు ముగిసింది. కొత్త టెండర్ పిలిచే వరకు ఉన్న సబ్ కాంట్రాక్టర్‌నే కొనసాగిస్తున్నారు. వాటా లాగేసుకున్న సదరు వైసీపీ నేత బినామీ లక్షల్లో లాభాలు గడించే అవకాశం ఉన్న వర్క్ కావడంతో తెలివిగా పావులు కదుపుతున్నాడు. మరో రెండు నెలల్లో కొత్త టెండర్ పిలిచే అవకాశం ఉండడంతో ఎలాగైనా దీన్ని కొట్టేయడానికి ప్రయత్నాలు ప్రారంభించారు. ప్రస్తుతం 60శాతం వాటా లాగేసుకుని చేతిలో ఉంచుకోగా ఈ దఫా మొత్తం సబ్ కాంట్రాక్టు కోసం ముమ్మరంగా పావులు కదుపుతున్నారు. అందుకోసం ప్రస్తుత కొత్త ప్రభుత్వంలో కొందరు దిగువ స్థాయి అధికారపార్టీ నేతలను మచ్చిక చేసుకునే ప్రయత్నం మొదలుపెట్టారు. తమ నేత చేతిలో ఎమ్మెల్సీ పదవి ఉండడంతో దీనిద్వారా సదరు బినామీ వీరితో రాయబేరాలు మొదలుపెట్టారు. నేరుగా టీడీపీ కీలక నేతలకు టచ్‌లోకి వెళ్తే పని అయ్యేదని భయంతో దిగువస్థాయి నేతలతో మంతనాలు జరుపుతున్నారు. సబ్‌కాంట్రాక్టును దక్కించుకోవడం, దక్కించుకున్నా అధికారపార్టీ నుంచి అభ్యంతరం ఉండకుండా ఉండేలా పావులు కదుపుతుండడం విశేషం. సదరు బినామీ కొంపదీసి కాంట్రాక్టు దక్కించుకుని మళ్లీ జీజీహెచ్‌లో అడుగుపెడితే శానిటేషన్ వ్యవస్థ దెబ్బతింటుందని బెంబేలెత్తుతున్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం

-6లో



కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్కేటింగ్ ఆడిటోరియంలో అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా యోగాసనాలు వేస్తున్న కలెక్టర్ తదితరులు

జిల్లాలో 167 సెల్‌ఫోన్లు రికవరీ చేశాం: ఎస్పీ



సెల్‌ఫోన్లు చూపిస్తున్న జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: జిల్లాలో 167 సెల్‌ఫోన్లు రికవరీ చేశామని ఎస్పీ సతీష్‌కుమార్ తెలిపారు. కాకినాడలోని ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం సెల్‌ఫోన్ల బాధితులకు సెల్‌ఫోన్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆయనమాట్లాడుతూ దొంగిలించిన తమ విలువైన ఫోన్లను రికవరీ చేసి ఇవ్వడం చాలా ఆనందంగా ఉందన్నారు. ఈ ఫోన్ల ఖరీదు రూ.20లక్షల విలువ కలిగి ఉంటుందన్నారు. ఈసెల్ ఫోన్‌ల రికవరీ విషయంలో విశేషమైన కృషి చేసిన ఐటీ కోర్ టీం ఇన్‌స్పెక్టర్ కృష్ణమోహన్, ఐటీ కోర్ బృంద సభ్యులకు, పోలీస్ సిబ్బంది అందరినీ అభినందించారు. మిస్ అయిన, దొంగిలించిన ఫోన్లను తిరిగి పొందడం కోసం జిల్లా ప్రజలు ఈ మొబీట్రాక్ కాకినాడ పోలీస్ సేవలను ఉపయోగించుకోవడానికి 94906 17852 నెంబర్‌కు వాట్సప్, మెసేజ్ ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో డీసీఆర్‌బీ ఇన్ స్పెక్టర్ ఈశ్వరుడు, ఎస్‌ఐలు, సీఐలు, డీఎస్పీలు పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకులను క్లోరినేషన్ చేయాలి

- క్షేత్రస్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ),జూన్ 21: జిల్లాలోని అన్ని గ్రామాల్లో సురక్షితమైన తాగునీరు ప్రజలకు అందించేలా నూరుశాతం మంచినీరు ట్యాంకులకు క్లోరినేషన్ చేయించాలని కలెక్టర్ జె.నివాస్ ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా క్షేత్రస్థాయి అధికారులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. తాగునీటి సమస్యల పరిష్కారం, మంచినీటి ట్యాంకుల క్లోరినేషన్, పారిశుధ్యం కార్యక్రమాల నిర్వహణపై ప్రతి సోమవారం మండలస్థాయిలో సమావేశం నిర్వహించాలన్నారు. గ్రామస్థాయిలో ప్రతి వీధిలో ఉన్న తాగునీటి పైపులైన్లు, మురికి కాలువల కింద ఉన్న పైపులైన్ల పరిస్థితిని తనిఖీ చేసి వివరాలు పంపించాలన్నారు. పతి శుక్రవారం డ్రై డే కార్యక్రమాన్ని అన్నిగ్రామాల్లో అమలు చేయాలన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు చేపట్టాలన్నారు. జిల్లా పంచాయతీ అధికారి భారతి సౌజన్య, జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈవో రామ్‌గోపాల్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌ఈ శ్రీనివాసు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, కాకినాడ, పెద్దాపురం డివిజనల్ అధికారులు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో ఒలింపిక్ రన్

కాకినాడ అర్బన్, జూన్ 21: అంతర్జాతీయ ఒలింపిక్స్ సందర్భంగా దేశవ్యాప్తంగా ఈనెల 23న ఒలింపిక్ రన్ నిర్వహిస్తున్న సందర్భంగా జిల్లాలో నిర్వహించడానికి ఏర్పాట్లు చేసినట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు ద్వారంపూడి భాస్కరరెడ్డి తెలిపారు. జిల్లాలోని కాకినాడ, పిఠాపురం, సామర్లకోట సెంటర్లలో ఉదయం 7.30 గంటలకు రన్ ప్రారంభమవుతున్నారు. క్రీడాకారులు,క్రీడాభిమానులు అందరూ రన్‌లో పాల్గొని విజయవంతం చేయాలని కార్యదర్శి గుబ్బల ఎలీషాబాబు కోరారు. చంద్రు గోవిందరాజు, కర్రి భామిరెడ్డి, వి.రవిరాజు పాల్గొన్నారు.

129మందికి షోకాజ్ నోటీసులు

- డీఈవో రమేష్

కాకినాడ రూరల్, జూన్ 21: జిల్లాలోని జడ్పీ,ఎంపీపీ, మున్సిపల్ పాఠశాలల్లో పనిచేస్తున్న 129మంది బోధన, బోధనేతర సిబ్బంది గురువారం ముఖ గుర్తింపు హాజరు వేయలేదని డీఈవో పిల్లి రమేష్ తెలిపారు. వారందరికీ షోకాజ్ నోటీసులు జారీ చేశామన్నారు. పాఠశాలల్లో పనిచేస్తున్న బోధన, బోధనేతర సిబ్బంది తప్పనిసరిగా ముఖగుర్తింపు హాజరు వేయాలని డీఈవో సూచించారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

- కాజులూరు మండలంలో విజిలెన్స్ దాడులు

-5లో

వేట్లపాలెంలో డయేరియా

- విరేచనాలతో 13 మంది బాధితులకు చికిత్స
- ముగ్గురు కాకినాడ జీజీహెచ్‌కు తరలింపు

-5లో

ఎన్నాళ్లకెన్నాళ్లకు..!!

- కాకినాడలో పోర్టు బైపాస్ రోడ్డుకు మోక్షం
- యుద్ధప్రాతిదికన చెత్త గుట్టల తొలగింపు పనులు



డంపింగ్ యార్డు వద్ద రోడ్డు మీద చెత్త గుట్టలను తొలగిస్తున్న దృశ్యం



అధికారులతో కలిసి డంపింగ్ యార్డు రోడ్డును పరిశీలిస్తున్న కొండబాబు

కాకినాడ సిటీ, జూన్ 21: కాకినాడ నగరం మీదుగా రాకపోకలు సాగించే వాహనాలను మళ్లించి ట్రాఫిక్ రద్దీ తగ్గించే నిమిత్తం ఎనిమిదేళ్ల క్రితం చేపట్టిన బైపాస్ రోడ్డు ఎట్టకేలకు వాడుకలోకి రానుంది. గత టీడీపీ ప్రభుత్వ హయంలో రూ.90కోట్ల స్మార్ట్‌సిటీ నిధులతో సర్పవరం సెంటర్‌నుంచి వలసపాకల సెంటర్, ఆర్టీవో ఆఫీసు రోడ్డు, గొడారిగుంట, డెయిరీఫారమ్ సెంటర్, సంజయ్‌నగర్ డంపింగ్ యార్డు మీదుగా పాత పోర్టురైల్వేస్టేషన్ వరకు 8 కిలోమీటర్ల పొడవున చేపట్టిన ఈ బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు 90శాతం పూర్తికాగా 10శాతం భాగం పూర్తి కాలేదు. గతంలో అప్పటి ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఈ బైపాస్ రోడ్డు నిర్మాణానికి కృషి చేసి నిధులు మంజూరు చేయించారు. భారీ వాహనాల రాకపోకలకు వీలుగా రెండు లైన్ల రహదారిగా మధ్యలో సెంటర్ డివైడర్‌తో సిమెంట్ రోడ్డు నిర్మించారు. ఆ తర్వాత వైసీపీ ప్రభుత్వ హయాంలో మిగిలిన 10శాతం కిలోమీటరు పొడవు రోడ్డు నిర్మాణ పనులు పూర్తి చేయించడంలో అప్పటి ఎమ్మెల్యే ద్వారంపూడి పట్టించుకోలేదనే విమర్శలు వ్యక్తమయ్యాయి. దీంతో మిగిలిన ఈ రోడ్డు భాగం కాలక్రమేణా డంపింగ్ యార్డు చెత్త గుట్టలతో మూసుకుపోయింది. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ రోడ్డు నిర్మాణంపై ఎమ్మెల్యే వనమాడి కొండబాబు దృష్టిసారించారు. అధికారులతో కలిసి రెండు రోజుల క్రితం డంపింగ్ యార్డును, చెత్తతో నిండిపోయిన రోడ్డు భాగాన్ని పరిశీలించారు. యుద్ధప్రాతిపదికన రోడ్డుభాగంలోని చెత్త గుట్టలను ఎక్స్‌కవేటర్‌తో తొలగించి ట్రాక్టర్లతో తరలించేలా సూచించారు. దీంతో ఈ పనులు వేగం పుంజుకుని రోడ్డు రూపురేఖలు బయటపడ్డాయి. ఈ బైపాస్‌రోడ్డు వాడుకలోకి వచ్చాక స్థానికులు, వాహనదారులు చుట్టూ తిరిగి జగన్నాథపురం ప్రాంతానికి వెళ్లే శ్రమ తప్పుతుంది. నేరుగా పాతపోర్టు రైల్వేస్టేషన్ మీదుగా కెనాల్ రోడ్డు వెంబడి జగన్నాథపురం ప్రాంతానికి చేరుకునే వీలు కలుగుతుంది.

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా డంపింగ్ యార్డు ప్రాంతం: కొండబాబు

తన అక్రమ సంపాదన కోసం జనావాసాల మధ్య గల సంజయ్‌నగర్ డంపింగ్ యార్డును మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మార్చుకున్నాడని కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ధ్వజమెత్తారు. డ్రగ్స్, గంజాయి కార్యకలాపాలను నిర్వహించుకోవడానికి అనువైన ప్రాంతంగా ఎంచుకుని ఇక్కడ జనసంచారం లేకుండా చేయడం కోసం కిలోమీటర్ మేర రోడ్డు వేయకుండా నియంత్రించాడన్నారు. ఈ రోడ్డును డంపింగ్ యార్డు నుంచి పాత పోర్టు రైల్వేస్టేషన్ వరకు పునరుద్ధరించేలా సూచించామన్నారు. త్వరలోనే సిమెంట్ రోడ్డును వేయించి బైపాస్ రోడ్డును పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామన్నారు.

వైసీపీ నాయకుల వల్లే వలంటీర్ల పోస్టులకు రాజీనామాలు చేశాం

- జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద వలంటీర్ల ధర్నా




కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న వలంటీర్లు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: వైసీపీ నాయకులవల్లే వలంటీర్ల పోస్టులకు బలవంతంగా రాజీనామాలు చేశామని వలంటీర్లు ఆవేదన వ్యక్తం చేశారు. కాకినాడలోని జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట వలంటీర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమకు రాజీనామా చేయడం ఇష్టం లేకున్నా వైసీపీ నేతలు, కార్యకర్తలు చెప్పిన మాటలతో రాజీనామాలు చేశామన్నారు. వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, రాజీనామాలు చేయాలని వారు డిమాండ్ చేయడంతో తప్పని పరిస్థితుల్లో రాజీనామాలు సమర్పించామన్నారు. వైసీపీ ఓడిపోయిన తర్వాత ఆ పార్టీ నాయకులు ఎవరూ తమకు ధైర్యం చెప్పకపోగా పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.

అందరూ ఎదురుచూస్తున్న అసెంబ్లీ కొలువుదీరింది. తొలి సభలో శాసనసభ్యుల ప్రమాణ స్వీకారాలు నిర్వహించారు. ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరి సమక్షంలో ఎమ్మెల్యేలంతా ప్రమాణ స్వీకారాలు చేయగా, సభ అంతా సందడి నెలకొంది. ఎవరు ఎలా ప్రమాణ స్వీకారం చేస్తారోనని అందరూ ఆసక్తిగా గమనించారు. అలాగే శాసన సభలో సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, మంత్రి లోకేశ్‌లను కలవడానికి కూటమి ఎమ్మెల్యేలంతా పోటీపడ్డారు. సభలో కనిపించిన దృశ్యాలివి..

'సభా' సందడి!

- తొలిరోజు ప్రమాణ స్వీకారోత్సవ సంబరం
- ప్రమాణం చేయించిన ప్రొటెం స్పీకర్ గోరంట్ల
- చంద్రబాబు, పవన్, లోకేశ్‌లను కలిసేందుకు ఉత్సాహం





శాసనసభలో చంద్రబాబును కలిసిన ఎమ్మెల్యేలు దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు), పంతం వెంకటేశ్వరరావు (నానాజీ), జ్యోతుల నెహ్రూ, వరుపుల సత్యప్రభ



పవన్‌కల్యాణ్‌తో ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



ప్రొటెం స్పీకర్ గోరంట్ల బుచ్చయ్యచౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యేలు పవన్‌కల్యాణ్, కందుల దుర్గేశ్, నిమ్మకాయల చినరాజప్ప



శాసనసభలో తమకు కేటాయించిన సీట్లలో ఆసీనులైన ఎమ్మెల్యేలు మిరియాల శిరీషాదేవి, వరుపుల సత్యప్రభ, యనమల దివ్య, దేవ వరప్రసాద్, ఆదిరెడ్డి శ్రీనివాస్, బత్తుల బలరామకృష్ణ తదితరులు

వేట్లపాలెంలో డయేరియా బాధితులు

- విరేచనాలతో 13 మందికి చికిత్స
- కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి ముగ్గురు తరలింపు
- మరో పది మందికి పలు ప్రైవేట్ ఆసుపత్రుల్లో చికిత్స



వైద్య బృందంతో పరిస్థితిని అడిగి తెలుసుకుంటున్న ఎంపీడీవో శ్యామ్‌సుందర్

సామర్లకోట, జూన్ 21: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శుక్రవారం పలువురు విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురయ్యారు. గ్రామంలో జొన్నల దొడ్డి ప్రాంతంలో సుమారు 13 మంది విరేచనాలకు గురికాగా, వారిలో ముగ్గురికి ఉన్నత చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులు అంబులెన్స్‌లలో తరలించారు. ఏడుగురికి వేట్లపాలెం పీహెచ్‌సీలో వైద్యులు డాక్టర్ హిమబిందు, డాక్టర్ పరదేశి ఆధ్వర్యంలో వైద్యం అందిస్తున్నారు. మరో పదిమంది విరేచనాలతో ప్రైవేట్ ఆసుపత్రుల్లో చేరినట్టు కుటుంబవర్గాల ద్వారా తెలిసింది. కాగా గ్రామంలో పలువురికి విరేచనాలతో డయేరియా బారినపడి అస్వస్థతకు గురైన సంఘటనపై అధికారులు ఉలిక్కిపడ్డారు. హుటాహుటిన వేట్లపాలెం వైద్యబృందం జొన్నలదొడ్డి ప్రాంతంతోపాటు గ్రామంలో ఇంటింటా పర్యటించి కాచి వడబోసిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. విరేచనాలు వంటి లక్షణాలు కలిగిన పలువురిని గుర్తించి టాబ్లెట్‌లను అందించారు. అలాగే గ్రామంలో డయేరియా వ్యాధి ప్రబలిందన్న సమాచారంతో సామర్లకోట ఎంపీడీవో శ్యామ్‌సుందర్, ఈవో పీఆర్డీ హరికృష్ణసత్యారెడ్డి తదితర పంచాయతీ సిబ్బంది గ్రామంలో తాగునీటి పైప్‌లైన్‌లను పరిశీలించారు. పలు ప్రాంతాల్లో పైప్‌లైన్ లీకులను గుర్తించి అరికట్టాలని సిబ్బందికి ఎంపీడీవో సూచించారు. కాగా గ్రామంలో డయేరియా ఏవిధంగా ప్రబలింది, ఆహారం విషయంలో ప్రజలు ఏమేమి జాగ్రత్తలు తీసుకున్నారనే అంశాలపై ఎంపీడీవో శ్యామ్ సుందర్ ఆరా తీశారు. జిల్లా వైద్యఆరోగ్య ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రత్యేక ఆదేశాల మేరకు గ్రామంలో డయేరియా అదుపులోకి వచ్చేవరకూ వైద్యఆరోగ్య సిబ్బంది పూర్తిగా అందుబాటులో ఉండాలని ఆదేశించారు. కాగా రాజధాని అమరావతి సచివాలయంలో శుక్రవారం ప్రమాణస్వీకారం కార్యక్రమంలో ఉన్న పెద్దాపురం ఎమ్మెల్యే నిమ్మకాయల చినరాజప్పకు వేట్లపాలెం గ్రామంలో పలువురు డయేరియా బారిన పడినట్ల సమాచారం తెలిసి సత్వరం స్పందించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారులకు, వేట్లపాలెం పీహెచ్‌సీ వైద్యులకు రాజధాని నుంచి ఫోన్ చేసి సమాచారాన్ని సేకరించారు. పూర్తిస్థాయిలో వైద్యం అందించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

డయేరియా బారినపడినవారు వీరే..

కొమ్మోజు సత్యవేణి, పరిమి స్రవంతి, పైలా అక్షయ్‌లను చికిత్స నిమిత్తం కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. పాలకుర్తి జ్యోతి, బిక్కిన భవాని, వడ్డాది పెద్దరాజు, వడ్డాది అప్పారావు, బంగారు హరిచరణ్, పరిమి దివ్య, వడ్డాది వెంకటచరణ్, వడ్డాది రామయ్య, బడ్డేటి వెంకటేష్, బడేటి సుభాష్, వడ్డాది గన్నివర్ధన్, అభిషేక్, మానస, మనుపర్తి వేగేశ్వరరావు చికిత్స పొందుతున్నారు.

బెండపూడిలో ఏడు డయేరియా కేసుల నమోదు

తొండంగి, జూన్ 21: కాకినాడ జిల్లా తొండంగి మండలం బెండపూడి గ్రామంలో శుక్రవారం ఏడు డయేరియా కేసులు నమోదయ్యాయి. వీటిలో నాలుగు కేసులకు స్థానికంగా చికిత్స అందించి మిగిలిన మూడు కేసులను కాకినాడ రిఫర్ చేశారు. అలాగే పంచాయతీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వైద్య శిబిరం కొనసాగుతోంది. ఇదిలా ఉండగా డిప్యూటీ డీఎంహెచ్‌వో సరిత ఈ కేంద్రాన్ని సందర్శించి రోగులను పరామర్శించారు. మరోవైపు గ్రామంలో పారిశుధ్య కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.



రాయవరంలో అవయవ దానంపై రూపొందించిన ప్రాజెక్టు

అగ్గిపుల్లలతో అవయవదానంపై ప్రాజెక్టు

ఆకట్టుకున్న రాయవరం విద్యార్థినుల ప్రతిభ

రాయవరం, జూన్ 21: అవయవ దానం మహాదానం అంటూ అవగాహన కల్పిస్తూ రాయవరం గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థినులు 1 లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో చేసిన కొలాజ్ ఆర్ట్ ద్వారా తయారు ప్రాజెక్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రాయవరం గ్రామంలో నివాసం ఉంటున్న మల్లిడి స్వర్ణలత మండపేట ఆదిత్య కాలేజ్‌లో ఇంటర్ చదువుతోంది. ఆమె సోదరి వైష్ణవి రాయవరం హైస్కూల్‌లో 9వ తరగతి చదువుతోంది. అనపర్తి మండలం రామవరం హైస్కూల్‌లో డ్రాయింగ్ టీచర్‌గా పనిచేస్తున్న డాక్టర్ మందపల్లి సత్యానందం ఆధ్వర్యంలో స్వర్ణలత, వైష్ణవి 1లక్షా 50వేల 330 అగ్గిపుల్లలతో సుమారు 2వేల 700 అగ్గిపెట్టెలు ఉపయోగించి 30 రోజులపాటు శ్రమించి మానవ శరీరంలో ఉండే ముఖ్యమైన అవయవాలను కొలాజ్ ఆర్ట్ ద్వారా 15 అడుగుల పొడవు, 13 అడుగుల వెడల్పుతో ప్రాజెక్టును తయారుచేశారు. వరల్డ్ రికార్డు తమ ప్రాజెక్టు పంపనున్నట్టు విద్యార్థినులు తెలిపారు. ఈ ప్రాజెక్టును రామచంద్రపురం డీవైఈవో నరసింహపాణి, ఎంఈవోలు ప్రత్తి రామలక్ష్మణమూర్తి, వై.సూర్యనారాయణ సందర్శించారు. ప్రాజెక్టు తయారుచేసిన విద్యార్థినిలను, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు సత్యానందంను డీవైఈవో, ఎంఈవోలు, హెచ్ఎం శాంతి సునీత అభినందించారు.





యోగాసనం వేసిన పీడీజే గంధం సునీత తదితరులు.. సెంట్రల్ జైలులో యోగాసనాలు వేసిన అధికారులు, ఖైదీలు

జీవన శైలిలో యోగా భాగం కావాలి

రాజమహేంద్రవరంలో పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 21(ఆంధ్రజ్యోతి): మన జీవన శైలిలో యోగాను ఒక భాగంగా చేసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని సంరక్షించుకోవచ్చని, శారీరక మానసిక శ్రేయస్సును మెరుగుపరిచే ఒక అభ్యాసం యోగా అని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని అంబేడ్కర్ కమ్యూనిటీ హాలులో జరిగిన కార్యక్రమంలో ఆమె పాల్గొని యోగాసనాలను వేశారు. యోగాలో పాటించాల్సిన పద్ధతులు, మెలకువలను యోగా శిక్షకుడు శ్యామ్ వివరించారు. అలాగే సెంట్రల్ జైలులో అధికారులు, ఖైదీలు యోగాసనాలు వేశారు. ప్రతి రోజూ ఉదయం ఖైదీలు యోగాతో తమ దైనందిన జీవనాన్ని ప్రారంభిస్తారని సూపరింటెండెంట్ ఎస్.రాహుల్ పేర్కొన్నారు. యోగా భారతి ట్రస్టు గురువులు అల్లు సత్యనారాయణ, నవీన.. యోగ, ధ్యానం చేయించిన అనంతరం అష్టాంగ యోగా విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో డిప్యూటీ సూపరింటెండెంట్లు ఎం.రాజ్‌కుమార్, బి.రత్నరాజు, జైలర్లు కెవీ రామారావు, ఆర్.శ్రీనివాసులు, కె.దుర్గారమేశ్, సీహెచ్ రమేశ్‌లు పాల్గొన్నారు.



సప్త నదీ జలాలకు అర్చకుల పూజలు

అంతర్వేదిలో ఘనంగా సప్తనదీ జ్యేష్ఠాభిషేక మహోత్సవం

వైభవంగా మహాశాంతి హోమం

అంతర్వేది, జూన్21: అంతర్వేదిలో కొలువై ఉన్న శ్రీలక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో శుక్రవారం జ్యేష్ఠా నక్షత్ర పర్వదినం సందర్భంగా శ్రీస్వామివారి మూలవరులకు సప్తనదీ జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. తొలుత అర్చకులు శిరస్సుపై సప్తనదీ జలాలు ఉంచుకుని ఆలయ ప్రదక్షిణ చేశారు. స్వామివారికి తొలుత పంచామృతాభిషేకం నిర్వహించి, సప్తనదులైన గంగా, యమునా, సరస్వతి, నర్మదా, గోదావరి, సింధు, కావేరి పవిత్ర గోదావరి జలాలతో మహాజ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. ఆలయ ప్రధానార్చకుడు పాణింగపల్లి శ్రీనివాసకిరణ్, పెద్దింటి శ్రీనివాస్, స్థానాచార్య, సహ అర్చకులు, వేదపండితులచే అత్యంత వైభవంగా నిర్వహించారు. విశ్వక్సేనపూజ, పుణ్యాహవచనం, దీక్షారాధన, చతుర్దశ కలశారాధన, నవకలశారాధన, పంచామృత కలశారాధన, సప్తనదీ కలశ ఆవాహనులు, ఆరాధనలు, విశేష అర్చనలు, అగ్నిమథనం, అగ్నిహోత్రాలతో ప్రత్యేక పూజల అనంతరం సప్త నదీజలాలతో, చతుర్దశ కలశాలతోను స్వామివారి మూలవరులకు మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించారు. అనంతరం మహాశాంతి హోమం వైభవంగా నిర్వహించి పూర్ణాహుతిలో భాగంగా పూజా ద్రవ్యాలను హోమంలో వేసి పూజా కార్యక్రమాలు పూర్తిచేశారు. అనంతరం తీర్థ ప్రసాదాలు, జలాభిషేక ద్రవ్యాల వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమారామగోపాలరాజా బహదూర్, ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ భైరా నాగరాజు, నల్లా సత్యకిరణ్‌ప్రసాద్, పోతురాజు శ్రీవెంకటకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



హోమంలో పూర్ణాహుతి ద్రవ్యాలు సమర్పిస్తున్న అర్చకులు, అధికారులు





హతమార్చిన రక్తపింజర పాము.. మహిళ మృతదేహం

పాముకాటుకు మహిళ మృతి

మామిడికుదురు, జూన్21: మామిడికుదురు మండలం పాశర్లపూడి బాడవకు చెందిన వనమాడి అంజలీదేవి (38) పాముకాటుకు గురై మృతిచెందినట్టు నగరం ఎస్ఐ వి.సురేష్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం మృతురాలు అంజలీదేవి గురువారం ఉదయం ఏడు గంటల సమయంలో తన ఇంటి వద్ద వాకిలి తుడుచుకుంటుండగా రక్తపింజర పాము కాటువేసింది. స్థానికులు పామును హతమార్చి, పాముకాటుకు గురైన మహిళను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రిలో చేర్పించగా చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందింది. ఆమె భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు.

ఏజెన్సీలో పాముకాటుకు వ్యక్తి మృతి



పాముకాటుకు మృతి చెందిన బాబూరావు

రాజవొమ్మంగి జూన్ 21: రాజవొమ్మంగి గ్రామంలోని శ్రీరామ్‌నగర్‌కు చెందిన పాతాళ బాబూరావు (45) అనే వ్యక్తి శుక్రవారం రాత్రి పాముకాటుకు గురై మృతిచెందాడు. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం.. బాబూరావు శుక్రవారం పొలం పనులు ముగించుకుని ఇంటికి వస్తుండగా మార్గమధ్యలో పొలంగట్టుపై పాము కాటువేయడంతో హుటాహుటీన ఇంటికి చేరుకున్నాడు. కుటుంబీకులు రాజవొమ్మంగి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే బాబూరావు మృతి చెందాడని వైద్యాధికారి సుష్మ వెల్లడించారు. దీంతో కుటుంబీకులు బోరున విలపించారు.

రైలు పట్టాలపై ఆడ శిశువు మృతదేహం



నిడదవోలు, జూన్21: పుట్టి పదిహేను రోజులైనా నిండని శిశువు మృతదేహం అనుమానాస్పదంగా రైలు పట్టాలపై ఉండడాన్ని పోలీసులు గుర్తించారు. ఎవరైనా కఠినాత్ములు ఆడపిల్ల పుట్టిందని రైలు పట్టాలపై వదిలేశారా లేక చనిపోయిన ఆడ శిశువును తెచ్చి పట్టాలపై వదిలేశారా అనేది చర్చనీయాంశమైంది. నిడదవోలులోని రైల్వేస్టేషన్ సమీపంలో ఉన్న యార్డ్ వద్ద శుక్రవారం రైలు పట్టాలపై పదిహేను రోజులలోపు వయసున్న గుర్తుతెలియని ఆడశిశువు మృతదేహాన్ని అనుమానాస్పద స్థితిలో జీఆర్పీ ఎస్ఐ జి.శ్రీహరిబాబు గుర్తించారు. మృత శిశువును పసుపు తెలుపు బొమ్మల డిజైన్ ఉన్న బేబీ కేరింగ్ కవర్‌లో ఉంచారని ఎరుపురంగు చున్నీ చుట్టూ చుట్టి ఉందని, పింక్ కలర్ జుబ్బా వేసి ఉందని చెప్పారు. దీనిపై అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మృతశిశువును గుర్తించినవారు 9490617090, 7013360296 నెంబర్లకు సమాచారం అందించాలని ఎస్ఐ కోరారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

ఆలమూరు, జూన్ 21: మండలంలోని చెముడులంక 216 (ఎ) జాతీయ రహదారిపై ధనలక్ష్మమ్మ ఆలయం ఎదురుగా గురువారం అర్ధరాత్రి జరిగిన ప్రమాదంలో అదే గ్రామానికి చెందిన గళ్లా సుబ్బారావు (56) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం సుబ్బారావు రైతువారీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. ఎప్పట్లాగే పొలం పనులు ముగించుకుని ఇంటికి తిరిగి వెళ్లే సమయంలో చెముడులంక కూడలి వద్ద ద్విచక్రవాహనంపై రోడ్డు దాటుతుండగా రాజమహేంద్రవరం నుంచి రావులపాలెం వైపు వెళుతున్న కారు వేగంగా వచ్చి ఢీకొట్టడంతో సుబ్బారావు అక్కడికక్కడే మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. ఇంటి పెద్ద మృతి చెందడంతో కుటుంబసభ్యులు కన్నీరు మున్నీరయ్యారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఏరియా ఆసుపత్రికి తరలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ శ్రీనునాయక్ తెలిపారు.

25న గురుకుల విద్యాలయాల్లో ప్రవేశాలు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ ఈనెల 25న జరుగుతుందని జిల్లా సమన్వయకర్త వెంకటరావు తెలిపారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఈనెల 27న ప్రవేశ పరీక్షలు సంబంధిత పాఠశాలలో జరుగుతుందని వెల్లడించారు. విద్యార్థులు చేరాలనుకునే పాఠశాలకు వెళ్లి దరఖాస్తు చేయాలన్నారు. ప్రధానంగా 6 తరగతి నుంచి 9 తరగతి వరకు ఉన్న ఖాళీలను భర్తీ చేస్తామన్నారు. ఈ షెడ్యూల్ ప్రకారమే అంబేడ్కర్ కోనసీమ జిల్లా, తూర్పుగోదావరి జిల్లా, కాకినాడ జిల్లాలో ప్రవేశాలు జరుగుతాయని సమన్వయకర్త వెంకటరావు తెలియజేశారు.

అక్రమంగా తరలిస్తున్న డీజిల్ సీజ్

కాజులూరు మండలంలో విజిలెన్స్ దాడులు

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 21: యానాం నుంచి అక్రమంగా డీజిల్ తరలిస్తున్నారనే సమాచారంతో రాజమండ్రి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు శుక్రవారం దాడులు చేశారు. కాకినాడ జిల్లా కాజులూరు మండలం కోలంక గ్రామ సమీపంలో టాటా వాహనం తనిఖీ చేయగా అక్రమంగా డీజిల్ తరలిస్తున్నట్టు గుర్తించారు. 16 డ్రమ్ముల్లో 3200 లీటర్ల డీజిల్‌ను పట్టుకున్నారు. వాహన యజమాని జొజ్జవరపు శ్రీనివాస్ ఆదేశాల మేరకు డ్రైవర్ కోరుకొండ కృష్ణను అదుపులోకి తీసుకున్నారు. ఈ డీజిల్ విలువ రూ.12,68,800 ఉంటుందని పేర్కొన్నారు. వీరిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పోలీస్‌స్టేషన్‌కు సిఫారసు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ సుబ్బారెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో పెట్రోల్ ఉత్పత్తుల అక్రమ నిల్వలపై దాడులు జరుగుతున్నాయి. తనిఖీల్లో విజిలెన్స్ అధికారులు జగన్నాథరెడ్డి, కిషోర్, శివ, లక్ష్మిప్రసన్న, రెవెన్యూ సివిల్ సప్లయ్స్ అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ

వనదుర్గ ఆలయంలో చండీహోమం

అన్నవరం, జూన్ 21: రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీసప్తసతి పారాయణలు, మూలమంత్రజపములు పఠించారు. 11గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

భూసార పరీక్షలు వేగవంతం చేయాలి : డీఏవో

సామర్లకోట, జూన్ 21: రైతులకు సాగు విధానంలో ఎంతో కీలకమైన భూసార పరీక్షలు వేగవంతం చేసి రైతులకు భూఆరోగ్య కార్డులను అందివ్వాలని జిల్లా వ్యవసాయాధికారి ఎన్.విజయకుమార్ ఆదేశించారు. శుక్రవారం సామర్లకోటలోని జిల్లా భూసార పరీక్షా కేంద్రాన్ని డీఏవో సందర్శించారు. జిల్లా భూసార పరీక్షా కేంద్ర ఏడీఏ భాస్కరరావు, ఎస్టీఎల్ ఏవోలు ఎంఎంపీఎస్ పద్మశ్రీ, ఎన్.సుధామాధురి, పీ.పవిత్ర, కె.విజయకుమార్‌తో కలిసి సమీక్షించారు. 2023-24 సంవత్సరంలో పదివేల మట్టి నమూనాలు, 2024-25 సంవత్సరానికి గాను కమిషనర్ ఇచ్చిన 17,400 మట్టి నమూనాలు విశ్లేషించాల్సి ఉందన్నారు. ఇందుకు సాంకేతిక యాంత్రీకరణ సామగ్రి, అనుభవజ్ఞులైన సిబ్బంది, రసాయనాల అవసరాలపై డీఏవో సమీక్షించారు. ఇందుకు సంబంధించి కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలన్నారు. సుదీర్ఘకాలంగా పనిచేయని సాంకేతిక యంత్రాలను పక్కనబెట్టి అధునాతన యంత్రసామగ్రి అవసరంపై సమీక్షించారు. మట్టి నమూనాలు విశ్లేషణలో వేగవంతంగా చేపట్టి రైతులకు సకాలంలో విశ్లేషణ నివేదికలను అందజేయాలని డీఏవో ఆదేశించారు. అనంతరం మట్టి నమూనాల విశ్లేషణ పనితీరును పరిశీలించారు. సంచార భూసార పరీక్షా కేంద్ర వాహనం వాస్తవ సరిస్థితిపై ఎస్టీఎల్ ఏడీఏ భాస్కరరావు నుంచి సమాచారాన్ని తెలుసుకున్నారు.

బోట్లు, మత్స్యకారులకు తీవ్ర నష్టం

టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి వర్మ

ఉప్పాడ (కొత్తపల్లి), జూన్ 21: ఉప్పాడ మినీ హార్బర్ నిర్మాణంలో మత్స్యకారులు ఒడ్డుకు చేరుకునే మొగ ప్రాంతాన్ని సక్రమంగా డ్రెజ్జింగ్ చేయకపోవడంతో బోట్లకు, మత్స్యకారులకు తీవ్ర నష్టం జరుగుతుందని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. శుక్రవారం ఆయన ఉప్పాడ మినీ హార్బర్ ప్రాంతాన్ని పరిశీలించి మాట్లాడారు. హార్బర్ నిర్మాణంలో సాంకేతికలోపాలు ఉన్నాయని దీంతో సముద్రం మొగలోపల నుంచి బోట్లు ఒడ్డుకు చేరేక్రమంలో సముద్రం లోపలకు నిర్మించిన బండరాళ్లకు బోట్లు ఢీకొని నష్టం వాటిల్లుతుందన్నారు. దీంతో మొగ నుంచి కాకుండా క్షేమంగా చేరే దారి గుండా మత్స్యకారులు బోట్లను ఒడ్డుకు చేర్చుకుంటున్నారని తెలిపారు. మత్స్యకారులు క్షేమంగా ఒడ్డుకు చేరే దారిలో అధికారులు గేట్లు పెట్టి అభ్యంతరం పెట్టరాదని అధికారులను హెచ్చరించారు. మినీ హార్బర్ నిర్మాణం విషయంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి, సంబంధిత అధికారుల నేతృత్వంలో నిర్ణయం తీసుకుంటామని ఆయన చెప్పారు. టీడీపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు అనిశెట్టి సత్యానందరెడ్డి, మత్స్యకార నాయులు సూరాడరాజు, నాగేశ్వరరావు, తిక్కాడ తాతారావు, చోడిపల్లి ప్రసాద్, మేరుగు భూషణం, సనపయ్య తదితరులు పాల్గొన్నారు.

'అతిథిగృహాన్ని వినియోగంలోకి తీసుకురావాలి'

పిఠాపురం, జూన్ 21: రూ.లక్షలతో నిర్మించిన పట్టణంలోని మున్సిపల్ గెస్ట్‌హౌస్‌ను తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని మన ఊరు-మన బాధ్యత స్వచ్ఛంద సంస్థ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కొండేపూడి శంకరరావు, అల్లవరపు నగేష్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు మున్సిపల్ కమిషనరు కనకారావును కలిసి వినతిపత్రం అందజేశారు. గత ఐదేళ్లుగా దానిని నిరుపయోగంగా వదిలివేశారని, ప్రస్తుతం ఆవరణ అంతా పిచ్చిమొక్కలు పెరిగిపోయి ఉన్నాయని, గతంలో అద్దెల రూపంలో మున్సిపాలిటీకి లక్షలాది రూపాయిల ఆదాయం వచ్చేదని తెలిపారు. పలుమార్లు మున్సిపల్ ఛైర్‌పర్సన్, అధికారుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని, ఇప్పటి వరకూ అతిథిగృహం నిరుపయోగం ఉండటానికి కారణమైన వారిపై చర్యలు తీసుకోవాలని, భవనానికి మరమ్మతులు చేపట్టి తక్షణం వినియోగంలోకి తీసుకురావాలని కోరారు.

'యాసలపు జీవితం అందరికీ ఆదర్శం'

పెద్దాపురం, జూన్ 21: ప్రజల కోసం తపించిన కార్మిక నేత, ప్రజా ఉద్యమకారుడు యాసలపు సూర్యారావు జీవితం అందరికీ ఆదర్శమని మాజీ ఎమ్మెల్సీ ఎంవీఎస్ శర్మ అన్నారు. స్థానిక యాసలపు సూర్యారావు భవనంలో శుక్రవారం జరిగిన యాసలపు సూర్యారావు 12వ వర్ధంతి సభలో ఆయన మాట్లాడారు. ప్రజల కోసం తన జీవితాన్ని అంకితం చేసిన సూర్యారావు ధన్యజీవి అని, ప్రజల మధ్యనే ఉంటూ వారి బాగోగులు చూస్తూ వారి అభివృద్ధికి పాటుపడిన గొప్ప వ్యక్తి అని కొనియాడారు. యాసలపు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. కరణం ప్రసాదరావు, కూనిరెడ్డి అరుణ, కేదారి నాగు, చల్లా విశ్వనాథం, దాడి బేబి తదితరులు పాల్గొన్నారు.

'కార్మికులకు వేతనాలు చెల్లించాలి'

జగ్గంపేట, జూన్ 21: పెంకుల తయారీ పరిశ్రమల్లో పనిచేస్తున్న కార్మికులకు కార్మిక చట్టం ప్రకారం వేతనాలు చెల్లించాలని ఐఎఫ్‌టీయూ నేత ఎం.ఏసు డిమాండ్ చేశారు. కేంద్రంలో ఉన్న ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక, రైతు, విద్యార్థి వ్యతిరేక విధానాలను అవలంభిస్తోందన్నారు. కార్మికులకు రక్షణగా ఉన్న చట్టాలను రద్దు చేసి కార్పొరేట్ కంపెనీలకు సేవ చేస్తోందన్నారు. పీవైఎల్ నేత గంటా బాలరాజు మాట్లాడుతూ కార్మికులను ఓటు బ్యాంకుగా చూడకుండా ప్రజా సమస్యల పరిష్కారం మాదిరిగానే వారి సమస్యలను పరిష్కరించాలన్నారు. గుబ్బల ఆదినారాయణమూర్తి పాల్గొన్నారు.

నేడు జనసేన ప్రధాన కార్యదర్శి నాగబాబు రాక

పిఠాపురం, జూన్ 21: జనసేన పార్టీ ప్రధాన కార్యదర్శి కొణిదెల నాగబాబు శనివారం పిఠాపురం నియోజకవర్గానికి రానున్నారు. మధ్యాహ్నం 3.30గంటల నుంచి గొల్లప్రోలు మండలం చేబ్రోలులోని జనసేన అధినేత పవన్‌కల్యాణ్ నివాసంలో నాగబాబు అందుబాటులో ఉంటారని జనసేన నియోజకవర్గ కోఆర్డినేటర్ మర్రెడ్డి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. జనసేన నాయకులు, కార్యకర్తలు ఈ విషయాన్ని గమనించాలని ఆయన కోరారు. కాగా ఉదయం నుంచి వివిధ వర్గాల ప్రజలుతో నాగబాబు సమావేశమవుతారని జనసేన వర్గాలు తెలిపాయి.

రేపు ఎమ్మెల్యే దివ్య విజయోత్సవ సభ

కోటనందూరు, జూన్ 21: తుని రాజా గ్రౌండ్‌లో ఆదివారం జరిగే ఎమ్మెల్యే యనమల దివ్య విజయోత్సవ సభను విజయవంతం చేయాలని టీడీపీ మండలాధ్యక్షుడు గాడి రాజుబాబు పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కార్యకర్తలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామం నుంచి అధికంగా పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో మాజీ జడ్పీటీసీ పెంటకోట భాస్కరసత్యనారాయణ, డి.చిరంజీవిరాజు, అంకంరెడ్డి రమేష్, పోతల సూరిబాబు, షేక్‌నవాబ్‌జానీ, అంకంరెడ్డి బుల్లిబాబు, వెలగా వెంకట కృష్ణారావు, యర్రచిన సత్యనారాయణ, బంటుపల్లి వెంకటేశ్వరరావు, మాతిరెడ్డి బాస్కరరావు, బి.శ్రీరామమూర్తి తదితరులున్నారు.

రేపు సినీ సంగీత విభావరి

పోర్టుసిటీ (కాకినాడ), జూన్ 21: కోన విజయభాస్కరరావు మెమోరియల్ మ్యూజిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం సినీ సంగీత విభావరి నిర్వహిస్తున్నామని నిర్వాహకులు బీవీఎస్ ప్రభాకర్, మార్ని జానకిరామ చౌదరి తెలిపారు. సాయంత్రం 5గంటలకు కాకినాడ సినిమారోడ్‌లోని సూర్యకళామందిరంలో ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. సంగీత విభావరిలో ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం గానం చేసిన గీతాలను హాయి.. హాయి. హాయి.. పాటతో ప్రారంభమవుతుందన్నారు. మాస్టర్ కాశీకృష్ణ సాయినాథ్ బృందం గీతాలను ఆలపిస్తారని వివరించారు. ప్రముఖ సంగీత విద్వాంసురాలు పెద్దాడ సూర్యకుమారి దంపతులకు సన్మానం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో సంగీత కళాకారులు, సంగీత ప్రముఖులు విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

ఎస్‌బీఐ ఉద్యోగుల రక్తదానం

కాకినాడ సిటీ, జూన్ 21: స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా స్టాఫ్ యూనియన్ అమరావతి సర్కిల్(ఎస్‌బీఐ ఎస్‌యుఏసీ) కాకినాడ రీజియన్ ఆధ్వర్యంలో దివంగత కార్మిక నేత తారక్‌నాథ్ వర్ధంతి సందర్భంగా రోటరీ బ్లడ్ బ్యాంక్‌లో రక్తదాన శిబిరం శుక్రవారం నిర్వహించారు. దీనిలో 40మంది ఉద్యోగులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. అనంతరం జీజీహెచ్ వద్ద 500మందికి అన్నదానం చేశారు. వృద్ధాశ్రమంలో వస్తు సామగ్రిని అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ వైస్ ప్రెసిడెంట్ పేరిశాస్త్రి, రీజనల్ సెక్రటరీ లక్ష్మి, రామ్‌కుమార్, దుర్గాభవాని పాల్గొన్నారు.

గ్రావెల్ తరలిస్తున్న వాహనాలు సీజ్

ఏలేశ్వరం, జూన్ 21: మండలంలోని లింగంపర్తి గ్రామ పరిధిలో అక్రమంగా ఎర్రమట్టి గ్రావెల్‌ను తరలిస్తున్న వాహనాలను శుక్రవారం రెవెన్యూ అధికారులు సీజ్ చేశారు. గ్రామస్తులు ఇచ్చిన సమాచారం మేరకు ఏ అనుమతులు లేకుండా కొండ లిమ్మాపురం పొలాల నుంచి గ్రామంలో పునాదులకు తరలిస్తున్న ట్రాక్టర్, జేసీబీను స్వాధీనం చేసుకుని ఒక వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్టు రెవెన్యూ ఇన్స్పెక్టర్ శ్రీనివాస్ తెలిపారు. దీనిపై పోలీసులకు ఎటువంటి సమాచారం అందలేదన్నారు.

తాగునీటిలో ఎరలు, తోక పురుగులు

కొత్తపల్లి, జూన్ 21: పొన్నాడ శివారు రావివారిపోడు గ్రామంలో మంచినీటి కుళాయిల ద్వారా తోక పురుగులు, ఎరలు రావడంతో ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తమ గ్రామానికి వచ్చే పంచాయతీ కుళాయిల ద్వారా వచ్చే తాగునీరులో తోక పురుగులు, ఎరలు వస్తున్నాయని... వాటర్ ట్యాంక్‌లను క్లోరినేషన్ చేయకపోవడం వల్ల తరచూ పురుగులున్న మంచినీరు సరఫరా జరుగుతుందని గ్రామస్తుడు మురళీ పేర్కొన్నాడు. పురుగులతో ఉన్న మంచినీరును సరఫరా చేయడం ద్వారా ప్రజలు అనారోగ్యం పాలయ్యే ప్రమాదం ఉందని, గ్రామంలో ఉన్న మంచినీటి ట్యాంక్‌ను శుభ్రం చేసే విధంగా తగు చర్యలు చేపట్టాలని ఆయన అధికారులకు విజ్ఞప్తి చేశాడు.



రావివారిపోడులో తాగునీటిలో వచ్చిన ఎర

యోగాతో అద్భుత ప్రయోజనాలు

» జిల్లా కలెక్టర్ నివాస్ » ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం » యోగా చేసిన విద్యార్థులు, నాయకులు







సర్పవరంజంక్షన్:పండూరు హైస్కూల్ విద్యార్థుల యోగభ్యసనాలు, గొల్లప్రోలురూరల్:చేబ్రోలులో విద్యార్థుల సూర్యనమస్కారాలు, జగ్గంపేటలో యోగాసనాలు

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 21: ప్రజల దైనందిన జీవితంలో యోగా ఒక భాగం చేసుకోవడం ద్వారా అద్భుత ప్రయోజనాలు పొందవచ్చని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని శుక్రవారం పురస్కరించుకుని జిల్లా ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో కాకినాడ మున్సిపల్ కార్పొరేషన్ ఇండోర్ స్కేటింగ్ ఆడిటోరియంలో పతాంజలి, బ్రహ్మకుమారి సంస్థల యోగా గురువులు వెయ్యిమందితో నిర్వహించిన కార్యక్రమానికి కలెక్టర్ హాజరై యోగాసానాల సాధన చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా వాసులు తమ దైనందిన జీవితంలో యోగాను భాగంగా చేసుకోవాలన్నారు. రోజూ 45నిమిషాలు యోగాసనాలతోపాటు ఇతర శారీరక శ్రమ చేయడం ద్వారా అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో కాకినాడ కమిషనర్ జె.వెంకటరావు, జిల్లా ఉపాధి శిక్షణాధికారి జి.శ్రీనివాసరావు, పతాంజలి, బ్రహ్మకుమారి సంస్థల ప్రతినిధులు, జిల్లా ఆయుష్ విభాగం అధికారులు పాల్గొన్నారు.

బీజేపీ కాకినాడ జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు ఏడిద కృష్ణ ఆధ్వర్యంలో యోగా దినోత్సవం నిర్వహించారు. శ్రీరామచంద్ర మిషన్ సహజ మార్గ జ్ఞాన శిక్షణ కేంద్ర ప్రాంగణంలో యోగా గురువు రాణికి ఘన సన్మానం చేశారు. కార్యక్రమంలో సాలిగ్రామ లక్ష్మి, పైడా వెంకటనారాయణ, రాచర్ల చిన్ని, నరుకుర్తి మూర్తి, ప్రసాద్‌రాజు పాల్గొన్నారు.

జేఎన్టీయూకే: యోగాను నిత్యజీవితంలో భాగం చేసుకుని మానసిక ఒత్తిడిని అధిగమించవచ్చని ఎన్ఎస్ఎస్ ఇన్‌చార్జ్ సమన్వయకర్త డాక్టర్ జి.శ్యామ్‌కుమార్ తెలిపారు. జేఎన్టీయూకే ఇండోర్ మైదానంలో ఎన్ఎస్ఎస్, వర్సిటీ స్పోర్ట్స్ కౌన్సిల్ సంయుక్త ఆధ్వర్యంలో యోగా దినోత్సవాన్ని జి.శ్యామ్‌కుమార్ అధ్యక్షతన నిర్వహించారు. వర్సిటీ అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో యోగా శిక్షకురాలు చంద్రు సుధాదేవి వివిధ రకాల యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు, పీడీలు, అధ్యాపకులున్నారు.

సర్పవరం జంక్షన్: కాకినాడ ఎన్‌సీసీ గ్రూప్ హెడ్‌క్వార్టర్ కల్నల్ సభ్యసాచి దాస్ ఆధ్వర్యంలో సూర్యారావుపేట ఎన్టీఆర్ బీచ్‌లో సామూహిక యోగా సాధన నిర్వహించారు. వలసపాకల కేంద్రీయ విద్యాలయంలో సెంట్రల్ బ్యూరో ఆఫ్ కమ్యూనికేషన్స్ కాకినాడ అధికారి కందాళ శ్రీరామమూర్తి పాల్గొన్నారు. విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. పండూరు హైస్కూల్ గెజిటెడ్ హెడ్మాస్టర్ ఈ సూర్యప్రకాశిని ఆధ్వర్యంలో విద్యార్థులు పలు ఆసనాలతో ఆకట్టుకున్నారు. ఏపీఎస్పీ 3వ బెటాలియన్‌లో అడిషనల్ కమాండెంట్ ఈఎస్ఎస్ సాయిప్రసాద్ ఆధ్వర్యంలో సిబ్బందితో సామూహిక యోగా సాధన చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమాండెంట్ వీవీవీ సత్యనారాయణ, ఆర్ఐలు శ్రీనివాసరావు, రాము, సతీష్‌కుమార్, రవిశంకర్ పాల్గొన్నారు. తిమ్మాపురం అక్కా ఎంఎస్ఎన్ పీజీ సెంటర్‌లో ప్రిన్సిపాల్ ఎస్.ప్రశాంతశ్రీ ఆధ్వర్యంలో విద్యార్థులతో సామూహిక యోగాభ్యసన కార్యక్రమం చేపట్టారు.

పిఠాపురం: యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం చేకూరుతుందని 12వ అదనపు జిల్లా జడ్జి ఏ.వాసంతి అన్నారు. పట్టణంలోని లయన్స్ కల్యాణమండపంలో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది యోగాసనాలు వేశారు. అదనపు జిల్లా జడ్జి మాట్లాడుతూ మారుతున్న జీవన విధానంలో యోగా కీలకపాత్ర పోషిస్తుందన్నారు. యోగా వలన శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు ఉల్లాసం ఏర్పడుతుందని తెలిపారు. సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం.విజయరామేశ్వరి, ఏపీపీ అనిశెట్టి కాశీవిశ్వనాథ్‌రెడ్డి, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు ఎస్ఎం ఆలీ, యోగా మాస్టర్ ఎన్వీ రమణ పాల్గొన్నారు. పట్టణంలోని జగ్గయ్యచెరువు కాలనీలో గల బాదం మాధవరావు ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో పలువురు పుర ప్రముఖులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

గొల్లప్రోలు రూరల్: చేబ్రోలు జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులు యోగసనాలు వేశారు. సూర్యనమస్కారాల కార్యక్రమంలో పాలు పంచుకున్నారు. యోగా ప్రయోజనాలు వివరించారు. పాఠశాల హెచ్ఎం సీహెచ్ ప్రకాష్, వ్యాయామ ఉపాధ్యాయులు సుబ్బలక్ష్మి, శ్రీహరి, వరహాలు పాల్గొన్నారు. గొల్లప్రోలు, తాటిపర్తి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోనూ యోగా దినోత్సవం జరిగింది.

ప్రత్తిపాడు: మండలంలోని ధర్మవరం జడ్పీ హైస్కూల్లో యోగా దినోత్సవాన్ని సర్పంచ్ బెంతుకుర్తి సుశీల అబ్బాయి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి సీతా రామాంజనేయ చౌదరి, కాకినాడ జిల్లా అధ్యక్ష, ఉపాధ్యక్షులు చిలుకూరి రామ్‌కుమార్,ఉమ్మడి వెంకట్రావు మాట్లాడారు. యోగా గురువులు చిట్రి అప్పారావు, తోట రాఘవరావు, బర్రే కోటేశ్వరరావు, దొడ్డిపట్ల సోమన్నదొర, అద్దేపల్లి రాజాను సన్మానించారు. విద్యార్థులతో యోగాసనాలు వేయించారు. కార్యక్రమంలో జనసేన జిల్లా సంయుక్త కార్యదర్శి దాసంశెట్టి షారావు, పెంటకోట మోహన్, బీజేపీ నాయకులు సింగిలిదేవ్‌సత్తిరాజు, కర్రి ధర్మరాజు, కందా వీరాస్వామి, ఊటా వీరబాబు పాల్గొన్నారు. ప్రత్తిపాడు కోర్టు వద్ద సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జూనియర్ సివిల్ జడ్జి కాటం భాను పాల్గొని యోగా వల్ల కలిగే ప్రయోజనాలు వివరించారు. బార్ సెక్రటరీ మధుబాబు, ప్యానల్ న్యాయవాదులు బుగతా శివ తదితరులున్నారు.

సామర్లకోట: అచ్చంపేట మండల పరిషత్ పాఠశాలలో జరిగిన కార్యక్రమానికి ఎంఈవోలు వై.శివరామకృష్ణయ్య, పీ.పుల్లయ్య ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. గ్రామ ప్రజాప్రతినిధులు వీరంరెడ్డి పెదబాబు, వీరంరెడ్డి చినబాబు సలాది రమేష్, వెంకన్న, వీరబాబు పాల్గొన్నారు. యోగా శిక్షణలో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఐసీడీఎస్ పెద్దాపురం ప్రాజెక్ట్ సీడీపీవో ఐ.ఉషా, నిర్మలాకుమారి, వడ్డి ఎస్తేరురాణి పాల్గొన్నారు. సామర్లకోట అయోధ్యరామపురం మున్సిపల్ ఉన్నత పాఠశాలలో యోగా డేను నిర్వహించారు.

పెద్దాపురం: మానసిక ప్రశాంతతకు యోగా చక్కని మార్గమని ఏడవ అదనపు జిల్లా జడ్జి జి.చంద్రమౌళీశ్వరి అన్నారు. కోర్టు ఆవరణలో నిర్వహించిన యోగా కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. స్థానిక జవహర్ నవోదయాలో ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ రజిత ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె.దీప దైవకృప, జూనియర్ సివిల్ జడ్జి హర్షవర్ధన్, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి బుల్లెమ్మ పాల్గొన్నారు.

గండేపల్లి: సూరంపాలెం ఆదిత్య విద్యాసంస్థల్లోని హాస్టల్ ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ల ఆధ్వర్యంలో యోగాసనాలపై వివరించారు. యూనివర్శిటీ డిప్యూటీ ప్రో చాన్సలర్ డాక్టర్ ఎం.శ్రీనివాసరెడ్డి మాట్లాడారు. ఫార్మసీ కళాశాల డైరెక్టర్ డాక్టర్ కె.రవిశంకర్, ప్రిన్సిపాల్స్ డాక్టర్ ఎ.రమేష్, డాక్టర్ డి.సతీష్‌కుమార్, డాక్టర్ సంజయ్‌కుమార్, విలాస్ అనిల్ చవాన్, డాక్టర్ జోలా సంజయ్ పాల్గొన్నారు.

కిర్లంపూడి: కిర్లంపూడి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బీజేపీ మండలాధ్యక్షుడు ఆధ్వర్యంలో యడాలి రాంబాబు, సర్పంచ్ శ్రీలత రాంబాబు, భూపాలపట్నంలో సర్పంచ్ వీరంరెడ్డి కాశీబాబు ఆధ్వర్యంలో, చిల్లంగి ప్రభుత్వ పాఠశాలలో హెచ్ఎం మర్రా అప్పారావు, నవరేది ఆధ్వర్యంలో యోగా డే చేశారు.

జగ్గంపేట: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సాహితీ స్కూల్‌నందు విద్యార్థులకు యోగా విశిష్టతను తెలిపి వివిధ ఆసనాలు వేయించారు. గురుకుల పాఠశాలలో వాకర్స్ క్లబ్, ఆయుర్వేద డాక్టర్‌రేణుక ఆధ్వర్యంలో యోగా ఉపాధ్యాయులు వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు ముమ్మిడి వరపు సురేష్, డిప్యూటీ గవర్నర్ తోలేటి సూర్యనారాయణ విద్యార్థులతో ఆసనాలు వేయించారు. ప్రిన్సిపాల్ జి.రాజకుమారి, వైస్ ప్రిన్సిపాల్ జ్యోత్స్న ఉన్నారు. మండంలోని ఇర్రిపాకలో జరిగిన కార్యక్రమానికి ఐసీడీఎస్ సీడీపీవో పూర్ణిమ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఏలేశ్వరం: ఏలేశ్వరంలో యోగా గురువులు జక్కా లక్ష్మీ ప్రసాద్, రాజశేఖర్ మాష్టర్ ఆధ్వర్యంలో యోగా డే నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజకవర్గ బీజేపీ ఇంచార్జ్ గంటా బాలు దొర నేతృత్వంతో రాజశేఖర్‌ని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సత్కరించారు. పట్టణంలో పలుచోట్ల ఆర్ఎస్ఎస్, కార్యకర్తలు, నాయకులు, విద్యార్థులు యోగాసానాలు వేశారు. గట్టెం వెంకటరమణ, రెడ్డి లోవరాజు, ప్రిన్సిపాల్ సునీత, ప్రయోగమూర్తి, సీఎస్‌సీ రమాప్రభ, తోట రాఘవరావు, వెంకటరమణ, శరణ్య శ్రీను, జగదీష్ ఉన్నారు.

తాళ్లరేవు: కోరింగ కాలేజ్ ఆఫ్ ఫార్మసీ, అప్పర్ ప్రైమరీ స్కూల్లో విద్యార్థులు యోగాసానాలు వేశారు. డైరెక్టర్ చిట్టూరి కలికిమూర్తి, ప్రిన్సిపాల్ డాక్టర్ సువర్ణజ్యోతి, హెచ్ఎమ్ ఉమామహేశ్వరి ఉన్నారు.

తొండంగి: పెరుమాళ్ళపురం డిగ్రీ కళాశాలలో యోగా గురువు జిసత్యన్నారాయణ పలు యోగాసనాలు వేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కొమ్మనాపల్లి, చిన్నయ్యపాలెం, తొండంగి, బెండపూడి తదితర గ్రామాల్లోని కార్యక్రమాలు నిర్వహించారు.

కొత్తపల్లి: కొండెవరంలో బీజేపీ పిఠాపురం నియోజకవర్గ కో ఆర్డినేటర్ బిళ్ళకుర్తి రామేశ్వరరెడ్డి పార్టీ శ్రేణులతో కలసి యోగాసాలు సాధన చేశారు. యోగా గురువు సూర్యారావు, బీజేపీ కొత్తపల్లి మండలాధ్యక్షుడు కొమ్మినీడి భద్రరావు, పిఠాపురం నియోజకవర్గ కన్వీనర్ వాసంశెట్టి శ్రీనివాసరావు, జీలకర్ర సత్తిబాబు, డీవీఎస్‌రాజు, మురళీ, తోట ప్రభాకర్, పలువురు గ్రామస్తులు యోగాభ్యాసనలో ఉన్నారు.



రౌతులపూడి: ఎస్.పైడిపాలలో కేక్ కట్ చేస్తున్న నేతలు

టీడీపీ శ్రేణుల సంబరాలు

ప్రత్తిపాడు, జూన్ 21: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ రాజా శుక్రవారం అసెంబ్లీలో పదవీ ప్రమాణ స్వీకారం చేయడంతో ధర్మవరం, పోతులూరు, ఏలూరులో టీడీపీ శ్రేణులు కేక్‌లు కట్ చేశారు.ఏలూరులో సర్పంచ్ రొంగల సత్యనారాయణ,అడ్డాల త్రిమూర్తులుస్వీట్లు పంచారు.

ఏలేశ్వరం: ఎమ్మెల్యే సత్యప్రభ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా పట్టణాధ్యక్షులు మూది నారాయణ స్వామి, కౌన్సిలర్ అలమండ చలమయ్య నేతృత్వంలో భారీ కేక్ కట్ చేసి, మిఠాయిలు పంచారు. కౌన్సిలర్లు పెంద్ర శ్రీను, రాయుడు చిన్న, కోనాల వెంకటరమణ, యండగుండి నాగబాబు, సఖిరెడ్డి విజయబాబు, వైబోగుల సుబ్బారావు ఉన్నారు.

శంఖవరం: ఎమ్మెల్యేగా వరుపుల సత్యప్రభ ప్రమాణ స్వీకారం చేయడంతో శంఖవరంలో టీడీపీ సీనియర్ నేత పర్వత సురేష్, కత్తిపూడిలో వెన్నా ఈశ్వరుడు, నెల్లిపూడిలో బద్దిరామారావు ఆధ్వర్యంలో సంబరాలు జరిగాయి. కీర్తి సుభాష్, బద్దిరమణ, బుర్రావాసు, లక్ష్మిబాబు పాల్గొన్నారు.

రౌతులపూడి: ఎమ్మెల్యేగా సత్యప్రభ ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా మూలగపూడిలో టీడీపీ మండలాధ్యక్షుడు తమరాల సత్యనారాయణ, రౌతులపూడిలో మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, మాజీ ఎంపీపీ ఇటంశెట్టి సూర్యభాస్కరరావు, ఎస్.పైడిపాలలో మాజీ సర్పంచ్‌లు గొల్లుపెద్దదివాణం, ఈగల సత్యనారాయణ, శృంగవరంలో యామన బుజ్జీబాబు ఆధ్వర్యంలో జరిగిన సంబరాల్లో ప్రత్తిపాడు జనసేన ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు, కరణం సుబ్రహ్మణ్యం హాజరై కేక్ కట్ చేసి పంచారు.

తాళ్లరేవు: ముమ్మిడివరం ఎమ్మెల్యేగా దాట్ల బుచ్చిబాబు ప్రమాణస్వీకారం చేసిన సందర్భంగా తాళ్లరేవు సంతపేట సెంటరులో టీడీపీ జెండా ఎగురవేసి కేక్ కట్ చేసి కార్యకర్తలకు పంచారు. టీడీపీ నేతలు నడింపల్లి వినోద్, రోళ్ల శ్రీనివాస చక్రవర్తి పాల్గొన్నారు. కోరింగ పంచాయతీ పెదబొడ్డు గ్రామంలో టీడీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు వాడ్రేవు వీరబాబు ఆధ్వర్యంలో కార్యకర్తలు కేక్ కట్ చేశారు.

తొండంగి: యనమల దివ్య ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయడాన్ని ఆమె స్వగ్రామమైన ఏవినగరం గ్రామ ప్రజలు తిలకించి పులకించారు. బాణసంచా కాల్చారు.

తుని రూరల్: తుని ఎమ్మెల్యేగా యనమల దివ్య భారీ మెజారిటీతో గెలుపొందడంతో టీడీపీ నేత మోతుకూరి వెంకటేష్ అరుణాచలంలో 5వేల మందికి అన్నదానం చేశారు.

బడిఈడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలి



చిన్నారుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న డీఈవో

జిల్లా విద్యాశాఖాధికారి రమేష్

సర్పవరం జంక్షన్, జూన్ 21: బడి ఈడు పిల్లలంతా పాఠశాలల్లో చేర్పించేలా తల్లిదండ్రులకు అధికారులు అవగాహన కల్పించి, స్కూల్స్‌లో చేర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి పి.రమేష్ కోరారు. శుక్రవారం కాకినాడ రూరల్ రమణయ్యపేట శివారు కొత్తూరులో నేను బడికి పోతా కార్యక్రమం నిర్వహించారు. జీవనోపాధి కోసం వలస వచ్చి గుడారాల్లో ఉంటున్న చిన్నారుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. ప్రభుత్వ పాఠశాలల్లో అనేక సంక్షేమ కార్యక్రమాలు అమలు చేస్తున్నామని, ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనపథకం, యూనిఫారమ్, బూట్లు, కిట్లు, బేగ్స్ వంటివి అందిస్తున్నామన్నారు. ఐదేళ్లలోపు పిల్లలు ప్రీస్కూల్లో చేరాలని, 6 నుంచి 14 ఏళ్లలోపు పిల్లలు ప్రభుత్వపాఠశాలల్లో చేర్పించాలని కోరారు. నేను బడికి పోతా కార్యక్రమం ఈనెల 13 నుంచి జూలై 12 వరకు జరుగుతుందన్నారు. 6 నుంచి 14 ఏళ్ల వయసు గల 7 గురు పిల్లలను గుర్తించి సమీప పాఠశాల్లో చేర్పించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో డీసీవో వెంకట్రావు, జిల్లా ఏఎల్ఎస్ కోఆర్డినేటర్ కె హరికృష్ణ, పీవో ఐసీకే శ్రీనివాసరావు, పీవో ఎన్ఐసీ జె విజయ, ఎంఈవో వేణుగోపాల్, ఉపాధ్యాయురాలు రాధా మాధురి, శ్రీనివాసు, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రౌతుపాలెంలో ర్యాలీ

ప్రత్తిపాడు, జూన్ 21: బడిఈడు బాలలను బడిలో చేర్పించాలని కోరుతూ రౌతుపాలెంలో విద్యాశాఖ, అంగన్‌వాడీల సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో వి.రాజబాబు, హెచ్ఎం వైసత్యవతి, సీఆర్పీలు బాషా, రాంజీ ప్రసాద్, ఉపాధ్యాయులు ప్రవీణ్‌కుమార్, మల్లేశ్వరి, పాల్గొన్నారు. చింతలూరులో ఐసీడీఎస్ సీడీపీవో ఆర్ వీఎస్ లక్ష్మి బడికి పోతాం కార్యక్రమంలో మాట్లాడారు. శాంతి ఆశ్రమం పీహెచ్‌సీ వైద్యాధికారి జి.శివకృష్ణ, జడ్పీ హైస్కూల్ హెచ్ఎంలు రామారావు, నంబారు సత్తిబాబు ఉన్నారు.

'పేరు మార్పుపై ఎవరి ఒత్తిడి లేదు'

కిర్లంపూడి, జూన్ 21: పేరు మార్పుపై ఎవరి ఒత్తిడి లేదని, సవాల్ చేసి ఓటమి చెందడంతో మాట ప్రకారం పేరు మార్చుకున్నానని వైసీపీ నాయకుడు ముద్రగడ పద్మనాభరెడ్డి అన్నారు. కిర్లంపూడిలో శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ పిఠాపురం ఎన్నిక సందర్భంగా పవన్‌పై సవాల్ చేసి ఓటమి చెందడంతో పేరు మార్పునకు ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం తాజాగా పేరు మారుస్తూ గెజిట్ నోటిఫికేషన్ ఇచ్చిందని తెలిపారు. పేరు మార్పు కోసం ఒత్తిడి చేసిన కాపు, బలిజ యువతకు ధన్యవాదాలు చెప్తూ ఆ స్వేచ్ఛ కలగజేసినందుకు ఆనందంగా ఉందన్నారు.

'పిల్లల సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు దోహదం'

పిఠాపురం, జూన్ 21: పిల్లల్లో సృజనాత్మకత పెంపొందించి సమగ్ర వికాసానికి అంగన్‌వాడీలు దోహదం చేస్తాయని ఐసీడీఎస్ సీడీపీవో దుర్గాదేవి తెలిపారు. అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమాన్ని పట్టణంలోని రథాలపేట అంగన్‌వాడీ కేంద్రం వద్ద శుక్రవారం నిర్వహించారు. గ్రాడ్యుయేషన్ డే ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగింది. చిన్నారులకు పట్టాలు అందజేశారు. గర్భిణులు, బాలింతలకు పోషకాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీడీపీవో దుర్గాదేవి, సూపర్‌వైజరు డి.మణి, దానం కమలారాణి పాల్గొన్నారు.

జె.అన్నవరంలో గ్రాడ్యుయేషన్ డే

ఏలేశ్వరం, జూన్ 21: ఐసీడీఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో జె.అన్నవరం గ్రామంలో గ్రాడ్యుయేషన్ డే నిర్వహించారు. చిన్నారులు వివిధ వేషధారణలతో ఆకట్టుకున్నారు. ఐసీడీఎస్ అధికారిణి ఆర్.లక్ష్మీ, ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు రాంబాబు విచ్చేసి నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా ఐదేళ్లు నిండిన చిన్నారులందరినీ ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ కాకరపల్లి సునీత, విద్యార్థులు పాల్గొన్నారు.

మరిడమ్మ ఉయ్యాల తాళ్ల ఉత్సవం



ఉయ్యాల తాళ్ల ఉత్సవం నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దాపురం, జూన్ 21: నిత్యం భక్తులతో కొలవబడే మరిడమ్మ అమ్మవారి ఉయ్యాల తాళ్ల ఉత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పౌర్ణమి నాడు అమ్మవారి జాగరణ ఉత్సవానికి 15 రోజుల ముందు ఈ ఉయ్యాల తాళ్ల ఉత్సవాన్ని కోలాహలంగా నిర్వహించడం గత కొన్నేళ్లుగా ఆచారంగా వస్తోంది. అన్ని సామాజికవర్గా ప్రజలు పాల్గొని ఉత్సవాన్ని నిర్వహించడం ప్రత్యేకత సంతరించుకుంది. స్థానిక కోట ముందుకు చెందిన దళిత యువకులు రైతులకిచ్చిన రెండు తాటి చెట్లకు ప్రత్యేక పూజలు చేసి వాటిని నరికి పట్టణ వీధులగుండా మోసుకుంటూ తీసుకురావడం రివాజుగా వస్తోంది. ప్రత్యేక డప్పు వాయిద్యాలు, గరగలతో వాటిని మోసుకువచ్చి బాజాభజంత్రీల నడుమ తీసుకువచ్చిన తాటి చెట్లతో అమ్మవారి ఆలయం ముందు ఊయల వేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం ఫౌండ్ ట్రస్టీ డాక్టర్ చింతపల్లి బ్రహ్మజీ, దేవస్థానం అసిస్టెంట్ కమీషనర్ చేబ్రోలు రామ్మోహనరావు పాల్గొన్నారు.

ఆలయంలో చండీహోమం

మరిడమ్మ దేవస్థానంలో చండీహోమాన్ని వైభవంగా నిర్వహించారు. పౌర్ణమి సందర్భంగా అమ్మవారికి 700 శ్లోకాలతో వేదపండితులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితులు పర్యవేక్షణలో అమ్మవారికి శాస్త్రోక్తంగా అభిషేకాలు, పూజలు చేశారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు, వేదపండితులు, ఆసాదులున్నారు.

దుర్గాడలో ప్రత్యేక పూజలు



శివాలయంలో పూజలు నిర్వహిస్తున్న భక్తులు

గొల్లప్రోలు రూరల్, జూన్ 21: మండలంలోని దుర్గాడ శివాలయంలో ఏరువాక పౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు జరిగాయి. శుక్రవారం జ్యేష్ఠ నక్షత్రం, జ్యేష్ఠమాసం, ఏరువాక పౌర్ణమి పురస్కరించుకుని పంచాయతన సమేత ఉమా రామలింగేశ్వరస్వామికి విశేష పూజలు చేశారు. లలితాదేవికి పంచామృతాభిషేకం, సౌభాగ్య స్త్రీలతో లలితా సహస్రనామ కుంకుమార్చన జరిగాయి. అనంతరం లలితాదేవిని విశేషంగా అలంకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తుల ఆరోగ్యం కోసం సూర్యనమస్కారాలు, మహామృత్యుంజయహోమాలు నిర్వహించారు. ఆలయ అర్చకులు చెరుకూరి వీరబాబు, దత్తు సోదరులు పూజాది కార్యక్రమాలు జరిపించగా, ఏర్పాట్లను ఆలయ సేవాసమితి సభ్యులు పర్యవేక్షించారు.

మహాలక్ష్మి కల్యాణ మహోత్సవాలు

తుని రూరల్, జూన్ 21: తుని చిట్టూరి మెట్రోనందు గల వైకుంఠ నారాయణ సమేత మహాలక్ష్మి అమ్మవారి ద్వితీయ వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలు శుక్రవారంతో ముగిశాయి. ఆఖరి రోజున అమ్మవారికి సుప్రభాత పూజ, నిత్యార్చన,సేవాకాలం, పుణ్యాహవచనం, నిత్యోపాసన చూర్ణోత్సవం, చక్రతీర్థస్నానం, పూర్ణాహుతి, పవళింపు సేవ నీరాజన మంత్ర పుష్పాలు తీర్థప్రసాద గోష్టి వంటి కార్యక్రమాలు శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఎత్తున భక్తులు పూజలచరించారు.

దుర్గమ్మకు జ్యోతుల నవీన్ పూజలు

జగ్గంపేట, జూన్ 21: జిల్లా టీడీపీ అధ్యక్షుడు జ్యోతుల నవీన్‌కుమార్ విజయవాడ ఇంద్రకీలాద్రిపై వేంచేసి ఉన్న కనకదుర్గ అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. వేద పండితుల ఆశీర్వాదం తీసుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. జగ్గంపేట నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షుడు తామరాడ మాజీ సర్పంచ్ అనుకుల శ్రీకాంత్ ఉన్నారు.

పిడుగు పాటుకు గేదె మృతి

కోటనందూరు, జూన్ 21: మండలంలో శుక్రవారం పిడుగులతో అన్నిగ్రామాల్లో భారీ వర్షం కురిసింది. బిళ్లనందూరులో సుర్ల యర్రయ్యకు చెందిన గేదె పిడుగు పడి మృతి చెందింది. దీని విలువ సుమారు రూ.70వేలు ఉంటుందని, తనకు న్యాయంచేయాలని అధికారులను యర్రయ్య కోరాడు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తొండంగి, జూన్ 21: కొమ్మనాపల్లికి చెందిన కోన సత్యన్నారాయణ(65) చికిత్స పొందుతూ కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో శుక్రవారం మృతిచెందాడు. అతడికి డయేరియా సోకడంతో గతంలో చికిత్స నిమిత్తం కాకినాడ తరలించారు. వ్యాధి నుంచి పూర్తిగా కోలుకున్నప్పటికి ఇతర అనారోగ్య కారణాల వల్ల అతడు మృతిచెందాడని ఎవినగరం ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి డాక్టర్ రవికుమార్ తెలిపారు.

గుడిసె దగ్ధంపై కేసు నమోదు

తొండంగి, జూన్ 21: తొండంగికి చెందిన గాబు రాజు అనే వ్యక్తికి చెందిన పొలంలో ఉన్న గుడిసెను శుక్రవారం దగ్ధం చేసిన సంఘటనపై కేసు నమోదు చేసినట్టు తొండంగి పోలీసులు తెలిపారు. బాధితుడు ఐదుగురిపై ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

టవర్ పనుల అడ్డగింత

కోటనందూరు, జూన్ 21: మండలంలోని ఎల్‌డిపేట గ్రామం ఊరి మధ్యన ఎయిర్‌టెల్ ప్రైవేటు టవర్ ఏర్పాటు చేస్తుండగా గ్రామస్తులు అడ్డుకున్నారు. టవర్ ఏర్పాటుతో రేడియేషన్ వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే అవకాశం ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరారు.